మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర    సంపుటి : 08    సంచిక : 237    ఆదివారం    08 - 03 - 2026    పేజీలు: 8    వెల: 4

## మాధవస్వామి బ్రహ్మోత్సవాలు



4లో..

# రైసినా డైలాగ్‌లో ఏపీ విజన్‌ను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు






- ప్రపంచ నాలెడ్జ్ ఎకానమీకి భారత్ చిరునామా
- అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా తీర్చిదిద్దుతాం
- జనాభా నిర్వహణపై కొత్త విధానం ప్రకటించిన సీఎం

న్యూఢిల్లీ, 7 మార్చి ,మన గళం,: ప్రపంచ వేదికపై భారతదేశం నాలెడ్జ్ ఎకానమీకి కేంద్రంగా ఎదుగుతోందని, భవిష్యత్ సాంకేతికతకు అమరావతి కేంద్రబిందువుగా మారుతుందని ఆంధ్రప్రదేశ్

2 లో..





## ఇంధన భద్రతలో
# భారత్ బలోపేతం

- భారీ ముడి చమురు నిల్వలతో ముందస్తు సిద్ధత
- రిఫైనింగ్ సామర్థ్యంతో ప్రపంచంలో అగ్రస్థానం
- సంక్షోభ కాలాల్లోనూ స్థిరంగా దేశ ఇంధన వ్యవస్థ

మన గళం, న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత్ తన ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న వ్యూహాత్మక భూగర్భ నిల్వలు, పైప్‌లైన్లు, సముద్ర మార్గంలో ఉన్న నౌకల్లో కలిపి సుమారు 25 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు నిల్వలను సిద్ధంగా ఉంచినట్లు కేంద్ర వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ నిల్వలు అంతర్జాతీయంగా చమురు సరఫరా నిలిచిపోయినా

2 లో..

## న్యూస్ ఛానళ్ల టీఆర్పీ నివేదికలపై
# కేంద్రం తాత్కాలిక నిలుపుదల




- బార్క్‌కు కేంద్ర సమాచారప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాలు
- నాలుగు వారాలపాటు టీఆర్పీ ప్రక్రియ నిలిపివేత
- సంచలనాత్మక కథనాలపై ఆందోళన నేపథ్యంలో నిర్ణయం

మన గళం, న్యూఢిల్లీ : టెలివిజన్ న్యూస్ ఛానళ్లకు సంబంధించిన టెలివిజన్ రేటింగ్ పాయింట్స్ నివేదికలను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రేక్షకాదరణను అంచనా వేసే సంస్థ బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్‌కు కేంద్ర సమాచారప్రసార మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాలపాటు లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు టీఆర్పీ ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టం చేసింది. ఇటీవల పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కొన్ని టీవీ న్యూస్ ఛానళ్లు అనవసర సంచలనాత్మక,

2 లో..

## విజయవాడలో పోలీసులపై
# కాల్పుల యత్నం



- బస్టాండ్ సమీప హోటల్‌లో తనిఖీలలో ఘటన
- తుపాకీ ట్రిగ్గర్ నొక్కినా పేలని బుల్లెట్
- వరంగల్‌కు చెందిన నిందితుడు అరెస్ట్

మన గళం, విజయవాడ : విజయవాడ నగరంలో పోలీసులపై కాల్పులకు యత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఈగల్ బృందంతో కలిసి శనివారం ఉదయం హోటల్‌లో తనిఖీలు చేపట్టగా అక్కడ ఉన్న ఓ వ్యక్తి

2 లో..

# తిరుపతిలో మైనర్ బాలికపై లైంగిక దాడి



- 11 ఏళ్ల బాలికపై దారుణ ఘటన
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు
- పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలింపు

2 లో..

## అమెరికా రేడార్ వ్యవస్థలపై
# ఇరాన్ దాడులు



- ☐ అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు
- ☐ జోర్డాన్, యూఏఈలో రేడార్ కేంద్రాల ధ్వంసం
- ☐ మిస్సైల్ రక్షణ వ్యవస్థకు పెద్ద దెబ్బ

మన గళం, దుబాయ్ : గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రంగా మారుతున్నాయి. అమెరికాఇజ్రాయెల్ దళాల చర్యలకు ప్రతిగా ఇరాన్ గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై దాడులు కొనసాగిస్తున్నట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి. యుద్ధం ప్రారంభమైన తొలి రోజుల్లోనే అమెరికాకు చెందిన కీలక రేడార్ వ్యవస్థను ఇరాన్ ధ్వంసం చేసినట్లు శాటిలైట్ చిత్రాలు

2 లో..

# మహిళల అభ్యున్నతే సమాజ ప్రగతికి కొలమానం: వైఎస్ జగన్

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు
- మహిళలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి
- మహిళా సాధికారతకు పలు పథకాలు అమలు చేశామని గుర్తు

అమరావతి, 8 మార్చి మన గళం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల మహిళలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళలు సంతోషంగా ఉంటే కుటుంబం బాగుంటుందని, కుటుంబం బాగుంటే గ్రామం, రాష్ట్రం చివరకు దేశం కూడా అభివృద్ధి చెందుతుందని

2 లో..



## న్యూస్ ఛానళ్ల టీఆర్పీ నివేదికలపై కేంద్రం తాత్కాలిక నిలుపుదల




ఊహాజనిత కథనాలను ప్రసారం చేసినట్లు కేంద్రం గమనించినట్లు సమాచారం. ఇలాంటి కథనాల వల్ల ప్రజల్లో అనవసర ఆందోళనలు, అపోహలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులు ఇలాంటి వార్తల కారణంగా తీవ్ర ఆందోళనకు గురవుతారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

టీఆర్పీ వ్యవస్థ ఆధారంగానే టెలివిజన్ ఛానళ్ల ప్రేక్షకాదరణను అంచనా వేస్తారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఏ కార్యక్రమాలను ఎక్కువగా చూస్తున్నారో తెలుసుకునేందుకు ఈ వ్యవస్థను ఉపయోగిస్తారు. టీఆర్పీ రేటింగ్‌ల ఆధారంగా న్యూస్ ఛానళ్ల మధ్య పోటీ కూడా కొనసాగుతుంది. అయితే ఈ పోటీ కారణంగా కొన్ని సందర్భాల్లో సంచలనాత్మక కథనాలకు ప్రాధాన్యం పెరుగుతుందనే విమర్శలు కూడా వస్తుంటాయి. ప్రకటనదారులు కూడా టీఆర్పీ నివేదికలను ఆధారంగా తీసుకుని తమ ప్రకటనల పెట్టుబడులను నిర్ణయిస్తారు. ఎక్కువ టీఆర్పీ ఉన్న ఛానళ్లలో ప్రకటనలు ఇవ్వడానికి కంపెనీలు ఆసక్తి చూపుతాయి. అందువల్ల టీఆర్పీ వ్యవస్థ టెలివిజన్ మీడియా రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది. గతంలో కూడా టీఆర్పీ వ్యవస్థపై వివాదాలు తలెత్తిన సందర్భాల్లో తాత్కాలికంగా నివేదికలను నిలిపివేసిన ఘటనలు ఉన్నాయి. తాజా నిర్ణయంతో టీవీ న్యూస్ రంగంలో టీఆర్పీ ఆధారిత పోటీ కొంతకాలం తగ్గే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. పరిస్థితులను సమీక్షించిన తరువాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## విజయవాడలో పోలీసులపై కాల్పుల యత్నం

అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకునేందుకు అధికారులు ముందుకు వెళ్లగా, ఆ వ్యక్తి అకస్మాత్తుగా తన వద్ద ఉన్న తుపాకీతో పోలీసులపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. అయితే ట్రిగ్గర్ నొక్కినప్పటికీ తుపాకీలో సాంకేతిక లోపం ఏర్పడడంతో బుల్లెట్ చాంబర్‌లోకి వెళ్లకపోవడంతో కాల్పులు జరగలేదు. దీంతో అక్కడ ఉన్న పోలీసు అధికారులు పెద్ద ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కాల్పులు విఫలమైన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అయితే అప్రమత్తమైన పోలీసులు వెంటనే అతన్ని వెంబడించి పట్టుకున్నారు. కొద్దిసేపు ఉత్కంఠభరితంగా సాగిన ఈ చేజింగ్ తరువాత నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడి వద్ద ఉన్న ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా నెల్లికుదురు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడి వద్ద నుంచి ఒక తొమ్మిది ఎంఎం పిస్టల్‌తో పాటు ఐదు రౌండ్ల బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోకి అతను ఎలా వచ్చాడు, ఆయుధాన్ని ఎక్కడి నుంచి తెచ్చుకున్నాడు, ఏ ఉద్దేశంతో అక్కడికి వచ్చాడు అనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ఘటన అనంతరం నిందితుడిని విజయవాడ టాస్క్ ఫోర్స్ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనతో నగరంలో భద్రతా ఏర్పాట్లను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి రద్దీ ప్రాంతాల్లో తనిఖీలను పెంచినట్లు అధికారులు తెలిపారు. నగరంలో అనుమానాస్పద కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగిస్తున్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## తిరుపతిలో మైనర్ బాలికపై లైంగిక దాడి

తిరుపతి, 7 మార్చి మన గళం, తిరుపతి నగరంలో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన తీవ్ర ఆందోళనకు దారి తీసింది. ఇంటిలో ఒంటరిగా ఉన్న 11 ఏళ్ల బాలికపై ట్రాక్టర్ డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై తిరుచానూరు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒక మహిళ తన మొదటి భర్తతో పుట్టిన 11 ఏళ్ల కుమార్తెతో కలిసి నివసిస్తోంది. అనంతరం ఆమె ఓ ట్రాక్టర్ డ్రైవర్‌ను రెండో వివాహం చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇంటిలో ఒంటరిగా ఉన్న బాలికపై ఆ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే బాలిక తల్లి తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. బాలికను వైద్య పరీక్షల కోసం తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన అనంతరం నిందితుడు పరారైనట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావడానికి దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఇంధన భద్రతలో భారత్ బలోపేతం



దేశీయ అవసరాలను సుమారు ఏడు నుండి ఎనిమిది వారాల వరకు తీర్చగలవని అధికారులు తెలిపారు. విశాఖపట్నం, మంగళూరు, పడూరు వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వ్యూహాత్మక భూగర్భ నిల్వ కేంద్రాలు అత్యవసర సమయాల్లో దేశానికి కీలక రక్షణగా నిలుస్తున్నాయి. గతంలో భారత్ తన ఇంధన అవసరాల కోసం ప్రధానంగా గల్ఫ్ దేశాలపైనే ఆధారపడేది. అయితే గత దశాబ్ద కాలంలో చమురు సరఫరా దేశాల సంఖ్యను గణనీయంగా పెంచి సరఫరా మార్గాలను విస్తరించింది. ఒకప్పుడు హోర్ముజ్ జలసంధిపై పూర్తి స్థాయిలో ఆధారపడిన భారత్ ఇప్పుడు ఆ ఆధారాన్ని గణనీయంగా తగ్గించి ఇతర మార్గాలను వినియోగిస్తోంది.

అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ రష్యా నుండి చమురు దిగుమతులను కొనసాగిస్తూ భారత్ తన జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చింది. ప్రస్తుతం రష్యా భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా నిలిచింది. ఇది ఇంధన రంగంలో భారత్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలకు ఉదాహరణగా భావిస్తున్నారు. ముడి చమురు దిగుమతిలోనే కాకుండా దానిని శుద్ధి చేసే సామర్థ్యంలో కూడా భారత్ ప్రపంచంలో కీలక స్థానాన్ని సంపాదించింది. ఏడాదికి సుమారు 258 మిలియన్ మెట్రిక్ టన్నుల శుద్ధి సామర్థ్యంతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా నిలిచింది. దేశీయ వినియోగానికి మించిన శుద్ధి సామర్థ్యం ఉండటం వల్ల పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతిలో కూడా భారత్ ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది.

గత దశాబ్ద కాలంలో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు తీవ్ర అస్థిరతను ఎదుర్కొన్నప్పటికీ భారత్ మాత్రం ధరల నియంత్రణలో స్థిరత్వాన్ని ప్రదర్శించింది. కోవిడ్ మహమ్మారి, రష్యాఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు వంటి పరిస్థితులు ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్‌లో ఇంధన సరఫరా నిలిచిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్న సమయంలో కూడా కేంద్రం పన్నులను తగ్గించి వినియోగదారులకు కొంత ఊరటనిచ్చింది. చమురు కంపెనీలతో సమన్వయం ద్వారా ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంది. దీని వల్ల ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో పెట్రోల్ ధరల పెరుగుదల తక్కువ స్థాయిలోనే నిలిచిందని అధికారులు చెబుతున్నారు. వంట గ్యాస్ ధరల విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగినప్పటికీ దేశీయ వినియోగదారులపై భారాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పేద కుటుంబాలకు అందించే ఉజ్వల యోజన పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లను తక్కువ ధరలకు అందజేస్తోంది. దిగుమతులపై ఆధారాన్ని తగ్గించేందుకు భారత్ ఇథనాల్ మిశ్రమ ఇంధన కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. దీని వల్ల చమురు దిగుమతులు తగ్గడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యం కూడా ఆదా అవుతోంది. ఈ కార్యక్రమం రైతులకు అదనపు ఆదాయం అందించడంలో కూడా సహాయపడుతోంది. మొత్తంగా చూస్తే ఇంధన భద్రతలో భారత్ స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతూ ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా నిలుస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమెరికా రేడార్ వ్యవస్థలపై ఇరాన్ దాడులు

సూచిస్తున్నాయి. జోర్డాన్‌లోని మువాఫక్ సల్టీ ఎయిర్‌బేస్ వద్ద ఉన్న ఏఎన్‌టీపీవై2 రేడార్ వ్యవస్థను ఇరాన్ క్షిపణి దాడులతో ధ్వంసం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ రేడార్ వ్యవస్థ అమెరికా థాడ్ క్షిపణి రక్షణ వ్యవస్థలో కీలక భాగంగా పనిచేస్తుంది. శత్రు దేశాల నుంచి ప్రయోగించబడే బాలిస్టిక్ క్షిపణులు మరియు డ్రోన్లను ముందుగానే గుర్తించి మిస్సైల్ రక్షణ వ్యవస్థలకు సమాచారం అందించడం ఈ రేడార్ ప్రధాన బాధ్యతగా ఉంటుంది శాటిలైట్ చిత్రాల ప్రకారం జోర్డాన్‌తో పాటు సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్న అమెరికా రేడార్ కేంద్రాలు కూడా దాడులకు గురైనట్లు అంచనా వేస్తున్నారు. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్ వద్ద ఉన్న రేడార్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. అలాగే యూఏఈలోని సదర్ మరియు రువాయిస్ ప్రాంతాల్లో ఉన్న అమెరికా రక్షణ వ్యవస్థలు కూడా నష్టపోయినట్లు శాటిలైట్ చిత్రాలు సూచిస్తున్నాయి.

మిస్సైల్ దాడులను ముందుగానే గుర్తించడంలో రేడార్ వ్యవస్థలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. శత్రు దేశం నుంచి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులు లక్ష్యానికి చేరుకునే ముందు వాటి దిశ, వేగాన్ని గుర్తించడం ద్వారా యాంటీ మిస్సైల్ వ్యవస్థలు సమర్థంగా పనిచేస్తాయి. రేడార్ వ్యవస్థలు దెబ్బతింటే మిస్సైల్ రక్షణ వ్యవస్థ పనితీరు కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం అమెరికా వాడుతున్న థాడ్ మిస్సైల్ రక్షణ వ్యవస్థకు చెందిన ఎనిమిది బ్యాటరీలు ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాల్లో ఉన్నాయి. వీటిలో రెండు యూఏఈలో, ఒకటి సౌదీ అరేబియాలో మోహరించబడ్డాయి. అలాగే ఇరాన్‌కు సుమారు ఐదు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జోర్డాన్‌లోని సల్టీ ఎయిర్‌బేస్ వద్ద కూడా ఒక థాడ్ బ్యాటరీ ఏర్పాటు చేశారు. థాడ్ వ్యవస్థలో ఉపయోగించే ఏఎన్‌టీపీవై2 రేడార్ ఒక అధునాతన మొబైల్ రేడార్ వ్యవస్థ. దీనిని అమెరికాకు చెందిన రేథియాన్ సంస్థ తయారు చేస్తోంది. ఈ రేడార్ వ్యవస్థ అత్యంత ఖరీదైన సైనిక సాంకేతికతలో ఒకటిగా భావించబడుతోంది. ఒక్కో వ్యవస్థ విలువ భారీగా ఉండటంతో పాటు శత్రు క్షిపణులను గుర్తించడంలో ఇది అత్యంత కీలకంగా పనిచేస్తుంది. ఇటీవలి దాడులతో గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారాయని విశ్లేషకులు చెబుతున్నారు. రేడార్ వ్యవస్థలపై దాడులు జరగడం వల్ల మిస్సైల్ రక్షణ వ్యవస్థల సామర్థ్యం తగ్గే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఈ పరిణామాలు మధ్యప్రాచ్య ప్రాంతంలో యుద్ధ పరిస్థితులను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలు పరిస్థితిని దగ్గరగా గమనిస్తున్నాయి.

## మహిళల అభ్యున్నతే సమాజ ప్రగతికి కొలమానం: వైఎస్ జగన్

తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి మరియు సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని తమ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేసిందని జగన్ గుర్తు చేశారు. వివిధ రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తూ సుమారు 32కు పైగా పథకాల ద్వారా వారికి భరోసా కల్పించామని చెప్పారు. మానవాళిలో సగభాగం మాత్రమే కాకుండా అభివృద్ధిలోనూ మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని జగన్ అన్నారు. మహిళల అభ్యున్నతే ఏ సమాజం ప్రగతికి ముఖ్యమైన కొలమానం అని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

## రైసినా డైలాగ్‌లో ఏపీ విజన్‌ను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్--2026' సదస్సులో ఆయన కీలక ప్రసంగం చేశారు. అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన ఈ వేదికపై ప్రసంగించేందుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. విదేశాంగ మంత్రి జైశంకర్ సమక్షంలో 110 దేశాలకు చెందిన ప్రతినిధుల ముందుకు వచ్చి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశను ఆయన వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో సైబరాబాద్ నిర్మాణంతో ఐటీ విప్లవానికి బాటలు వేసిన అనుభవంతో ఇప్పుడు అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ పరికరాల తయారీలో ప్రపంచానికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అమరావతిని కాలుష్య రహిత బ్లూ--గ్రీన్ నగరంగా, తొమ్మిది రకాల వినూత్న నగరాల సమాహారంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విశాఖపట్నంలో గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర ప్రగతికి నిదర్శనమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీలు భవిష్యత్తులో దేశాల అభివృద్ధిని నిర్ణయిస్తాయని చంద్రబాబు అన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ అల్గోరిథంల అభివృద్ధి, శిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గతంలో భారతీయ మేధావులు అవకాశాల కోసం విదేశాలకు వెళ్లేవారని, ఇప్పుడు పరిస్థితులు మారి రివర్స్ మైగ్రేషన్ ప్రారంభమైందని ఆయన చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో సుమారు 60 శాతం భారత్‌లో ఉండటం దేశ ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. జనాభా అంశంపై కూడా సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో జనాభా నియంత్రణ గురించి మాట్లాడిన తాము ఇప్పుడు మారుతున్న పరిస్థితుల దృష్ట్యా జనాభా వృద్ధిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దక్షిణ భారతదేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడం ఆందోళనకరమని పేర్కొంటూ దాన్ని పెంచేందుకు కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఇద్దరికి మించి పిల్లలు ఉన్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, మూడో బిడ్డకు ఆర్థిక ప్రోత్సాహం వంటి చర్యలు అమలు చేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గ్రీన్ ఎనర్జీ కారిడార్లను అభివృద్ధి చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. భవిష్యత్తులో భారత్ ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేసే సహకార సమైక్యవాదం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## కోడుమూరు టిడిపి కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం అంటున్న కేడీసీసి చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్ బాయ్స్ విద్యా కమిటీ చైర్మన్ అయిన ధర్మరాజు కి పక్షవాతం రావడంతో వారు పూర్తి ఆర్థికంగా దెబ్బతినడంతో ఈ విషయాన్ని చేనేత భాస్కర్, గంగాధర్ నాయుడు కోడుమూరు పట్టణ అధ్యక్షులు తెలుపగా వెనువెంటనే విష్ణువర్ధన్ రెడ్డి కి ఈ విషయం తెలియజేశారు. తెలియజేసిన వెంటనే విష్ణువర్ధన్ రెడ్డి స్పందించి తక్షణ సాయం, వారికి నెల రోజులు అయ్యే మెడిసిన్ అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.వెంటనే భాస్కర్, గంగాధర నాయుడు అలాగే శ్రీను దగ్గరికి వెళ్లి వారికి మెడిసిన్ ఖర్చును వారి సతీమణి కి ఇవ్వడం జరిగింది.ఇలా ఏమి జరిగినా టిడిపి కార్యకర్తలకు అన్ని విధాలుగా మేము ముందుంటామని స్థానిక టిడిపి నాయకులకు గాని టిడిపి పార్టీ, ప్రజలకు మరియు కార్యకర్తలకు గాని విష్ణువర్ధన్ రెడ్డి, బొగ్గుల దస్తగిరి ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా



ఉంటారని ఈ సందర్భంగా తెలిపారు.

## రేణుక జలగండేశ్వర్ వారి బృందం, వేలూరు తమిళనాడు వారిచే భక్తిరంజని కార్యక్రమం

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (07.03.2026) శ్రీమతి రేణుక జలగండేశ్వర్ వారి బృందం, వేలూరు తమిళనాడు వారిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, ఓం నమశ్శివాయ, శివాష్టకం, ఉమామహేశ్వర, శివుడు తాండవము, అదివో అల్లదివో శ్రీశైలం, అమ్మా నీ పాదము పలు శివకీర్తనలను శరవణన్, జయంతి, యోగరాజ్ తదితరులు ఆలాపించనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి.శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు




ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## సుమిత్ గణపతి మోర్గ్, వారి చే వాయిద్య పరికరాలు అందజేత





మనగళం శ్రీశైలం : ఈ రోజు ( 07.03.2026) సుమిత్ గణపతి మోర్గ్, నాందేడ్, మహారాష్ట్ర వారు పలు వాయిద్య పరికరాలను దేవస్థానానికి విరాళంగా అందజేశారు.వీటి విలువ సుమారు రూ. 1.20,660/-లు ఉంటుందని దాతలు తెలియజేశారు. దాత అందజేసిన ఈ వాయిద్య పరికరాలను ఈ రోజు ( 07.03.2026) కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దేవస్థానం నాదస్వర సిబ్బందికి అందజేశారు. శృతి, తాళం, డోలు పరికరాలు మరియు నాదస్వర పరికరాలను అందజేయడం జరిగింది. కార్యక్రమములో ఆలయ విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి యం. హరిదాసు, సంబంధిత గుమాస్తా వై. దివాకరరెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

---

## వేసవిలో కూలర్ల వ్యాపారం లాభదాయకం

హైదరాబాద్, మార్చి 7, మన గళం: వేసవి ప్రారంభం కావడంతో ఎండలు రోజురోజుకు తీవ్రంగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది ఎయిర్ కూలర్లను ఆశ్రయిస్తున్నారు. ఎయిర్ కండీషనర్ల ధరలు అధికంగా ఉండటం, విద్యుత్ బిల్లుల భయం కారణంగా మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కూలర్ల వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని వ్యాపార అవకాశంగా మార్చుకుంటే కేవలం మూడు నెలల వ్యవధిలోనే లక్షల్లో ఆదాయం పొందే అవకాశం ఉందని వ్యాపార నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో చల్లదనం పొందేందుకు కూలర్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. బ్రాండెడ్ కూలర్ల ధరలు ఎక్కువగా ఉండటంతో చాలా మంది తక్కువ ధరలో లభించే స్థానిక బ్రాండ్ లేదా అసెంబుల్ కూలర్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను సరిగ్గా ఉపయోగించుకుంటే తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు పొందే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ వ్యాపారంలో విజయం సాధించాలంటే ముందుగా తక్కువ ధరకు నాణ్యమైన కూలర్లను సేకరించడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్‌లోని కోఠి, బేగంబజార్ వంటి హోల్‌సేల్ మార్కెట్లలో కూలర్లు తక్కువ ధరలకు లభిస్తాయి. అలాగే నేరుగా తయారీ యూనిట్లను సంప్రదిస్తే మరింత తక్కువ ధరకు




సరుకును పొందే అవకాశం ఉంటుంది. ఇలా కొనుగోలు చేస్తే లాభాల శాతం పెరుగుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యాపారం ప్రారంభించడానికి పెద్ద షోరూమ్ అవసరం లేదని చెబుతున్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో లేదా ప్రధాన రహదారుల పక్కన చిన్న టెంట్ ఏర్పాటు చేసి కూడా కూలర్లను విక్రయించవచ్చు. అవసరమైతే మూడు నెలల పాటు చిన్న గిడ్డంగిని అద్దెకు తీసుకుని సరుకును నిల్వ ఉంచుకోవచ్చు. దీంతో నిర్వహణ ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

## మాధవస్వామి బ్రహ్మోత్సవాలు







మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లాలోని కోడుమూరు నియోజకవర్గం లో ప్రసిద్ధిగాంచిన పురాతనమైన గోరంట్ల మాధవస్వామి దేవాలయం కలదు ఈ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి స్వామివారి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు వేద



పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో మంగళ వాయిద్యాలతో కనుల వైభవంగా;ఎంతో ఘనంగా స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం శనివారం తెల్లవారుజామున 4 గంటలకు బ్రాహ్మ ముహూర్తంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ మాధవ స్వామి వారికి కళ్యాణం జరిపించారు ఈరోజు స్వామివారికి ఎంతో ప్రీతికరమైన శనివారం కావడం ఒక విశేషం ఈ కళ్యాణోత్సవంలో కోడుమూరు నియోజకవర్గ ప్రజలంతా విరివిగా పాల్గొని స్వామివారి అమ్మవార్ల తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు కళ్యాణ అనంతరం శనివారం ఉదయం 9 గంటలకు స్వామివారి ప్రభ ఉత్సవం వారి పురవీధి గుండా విరివిగా పాల్గొన్న ప్రజల కోలాహలాల మధ్య స్వామివారి అమ్మవారి ప్రభ ఉత్సవం ఎంతో వైభవంగా జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు మరియు అర్చకులు స్థానిక భక్తులు పాల్గొన్నారు

## నెట్‌ఫ్లిక్స్ కీలక ఒప్పందం

హైదరాబాద్, మార్చి 7,మన గళం: ప్రముఖ ఓటీటీ దిగ్గజ సంస్థ నెట్‌ఫ్లిక్స్ కృత్రిమ మేధ సాంకేతికతను మరింతగా వినియోగించుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. హాలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శకుడు బెన్ అఫ్లెక్ స్థాపించిన కృత్రిమ మేధ ఆధారిత ఫిల్మ్ టెక్నాలజీ సంస్థ 'ఇంటర్‌పాజిటివ్'ను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసింది. ఈ ఒప్పందంతో వినోద రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం మరింత విస్తరించనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సినిమా నిర్మాణ ప్రక్రియలో సాంకేతిక మార్పులకు ఇది దారితీసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. సినిమా నిర్మాణంలో అత్యంత క్లిష్టమైన దశగా భావించే పోస్ట్ ప్రొడక్షన్ పనులను సులభతరం చేయడమే ఈ కొనుగోలు వెనుక ప్రధాన ఉద్దేశ్యమని తెలుస్తోంది. ఇంటర్‌పాజిటివ్ అభివృద్ధి చేసిన కృత్రిమ మేధ సాంకేతిక సాధనాలు సినిమా నిర్మాణంలో పలు సాంకేతిక పనులను వేగంగా పూర్తి చేయడంలో సహాయపడతాయి. ముఖ్యంగా లైటింగ్ సర్దుబాటు, ఫ్రేమ్ కూర్పు, అలాగే విజువల్ ఎఫెక్ట్స్ వంటి అంశాలను తక్కువ సమయంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో సినిమా ఎడిటింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా సాగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ సమయం మరియు వ్యయం అవసరమవుతుంటుంది. అయితే కృత్రిమ మేధ ఆధారిత సాధనాల ద్వారా ఈ పనులను తక్కువ సమయంలో పూర్తి చేయడం సాధ్యమవుతుందని నెట్‌ఫ్లిక్స్ భావిస్తోంది. దీనివల్ల నిర్మాణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో పాటు సృజనాత్మక ప్రక్రియకు మరింత సమయం కేటాయించే అవకాశం దర్శకులకు లభిస్తుంది. సినిమా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గత కొన్ని సంవత్సరాల్లో గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ వంటి సాంకేతికతలు వినోద రంగాన్ని కొత్త దిశగా నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో సినిమా నిర్మాణ విధానాల్లో పెద్ద మార్పులకు దారితీయవచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బెన్ అఫ్లెక్ స్థాపించిన ఈ సంస్థ ఇప్పటికే పలు ప్రాజెక్టుల్లో కృత్రిమ మేధ సాంకేతికతను విజయవంతంగా ఉపయోగించినట్లు సమాచారం. సినిమా నిర్మాణంలో నాణ్యతను పెంచుతూ సమయాన్ని ఆదా చేసే విధంగా ఈ టెక్నాలజీ రూపొందించబడిందని చెబుతున్నారు. నెట్‌ఫ్లిక్స్ ఈ సంస్థను సొంతం చేసుకోవడం ద్వారా తన కంటెంట్ తయారీ ప్రక్రియను మరింత ఆధునికంగా మార్చే ప్రయత్నం చేస్తోంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## డిజిటల్ యుగంలో
## యువతకు సవాళ్లు

మన గళం డెస్క్ : సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని వేగంగా మార్చుతున్న ఈ కాలాన్ని డిజిటల్ యుగంగా పిలుస్తున్నారు. ముఖ్యంగా యువత జీవన విధానంపై ఈ డిజిటల్ మార్పులు గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. అంతర్జాలం, స్మార్ట్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికలు యువతకు అపారమైన అవకాశాలను అందిస్తున్నాయి. ప్రపంచంలోని సమాచారం క్షణాల్లో అందుబాటులోకి రావడం వల్ల విద్య, ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధిలో యువత ముందుకు సాగుతున్నారు. అయితే ఇదే సమయంలో ఈ డిజిటల్ ప్రపంచం కొన్ని కొత్త సవాళ్లను కూడా తీసుకొచ్చిందని నిపుణులు చెబుతున్నారు. డిజిటల్ సాంకేతికత యువతకు జ్ఞానం సంపాదించడానికి కొత్త మార్గాలను తెరిచింది. ఒకప్పుడు గ్రంథాలయాలు లేదా తరగతి గదులకే పరిమితమైన విద్య ఇప్పుడు డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ఆన్‌లైన్ విద్యా వేదికలు, వర్చువల్ తరగతులు, డిజిటల్ శిక్షణ కార్యక్రమాలు యువతకు విస్తృతమైన అవకాశాలను అందిస్తున్నాయి. ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థల పాఠ్యాంశాలు కూడా ఇప్పుడు ఇంట్లో నుంచే నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఉపాధి అవకాశాల పరంగా కూడా డిజిటల్ యుగం యువతకు కొత్త దారులను చూపుతోంది. సమాచార సాంకేతిక రంగం, డిజిటల్ వ్యాపారం, స్వయం ఉపాధి వంటి రంగాల్లో యువత తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు కూడా యువతకు తమ ఆలోచనలు, ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా మారాయి. చిన్న ఆలోచనలే పెద్ద వ్యాపారాలుగా మారే అవకాశాలు కూడా ఈ డిజిటల్ ప్రపంచం అందిస్తోంది.

అయితే ఈ డిజిటల్ ప్రపంచం అందిస్తున్న అవకాశాలతో పాటు కొన్ని సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల వినియోగం అధికమవడం వల్ల యువత సమయాన్ని వృథా చేసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల ముందు గడపడం వల్ల శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కంటి సమస్యలు, నిద్రలేమి, ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా డిజిటల్ వేదికల ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి కూడా ఒక పెద్ద సమస్యగా మారింది. యువత నిజమైన సమాచారం, తప్పుడు సమాచారాన్ని గుర్తించలేకపోతే తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంది. వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన సమస్యలు కూడా డిజిటల్ ప్రపంచంలో పెరుగుతున్నాయి. అందువల్ల సాంకేతిక వనరులను జాగ్రత్తగా ఉపయోగించడం చాలా అవసరం.

యువత డిజిటల్ వేదికలను సృజనాత్మకంగా ఉపయోగిస్తే అపారమైన అవకాశాలు పొందవచ్చు. విద్య, పరిశోధన, నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాల్లో డిజిటల్ వనరులను వినియోగించుకోవాలి. అవసరానికి మించి సామాజిక మాధ్యమాల్లో గడపకుండా సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సందర్భంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్ర కూడా చాలా కీలకంగా ఉంటుంది. యువతకు డిజిటల్ వినియోగంపై సరైన అవగాహన కల్పించడం అవసరం. సాంకేతికతను సమతుల్యంగా ఉపయోగించే అలవాటు చిన్నప్పటి నుంచే పెంపొందించాలి. యువత సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా డిజిటల్ వేదికలను ఉపయోగించేందుకు మార్గనిర్దేశం చేయాలి. డిజిటల్ యుగం యువతకు అపారమైన అవకాశాలను అందిస్తున్నప్పటికీ వాటిని సరిగ్గా వినియోగించడం చాలా ముఖ్యం. సాంకేతికతను సమర్థంగా ఉపయోగిస్తూ విద్య, నైపుణ్యాల అభివృద్ధి, సమాజ సేవ వంటి అంశాల్లో యువత ముందుకు సాగితే దేశ అభివృద్ధికి కూడా తోడ్పడగలరు. అందువల్ల డిజిటల్ ప్రపంచాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమతుల్య జీవన విధానాన్ని పాటించడం నేటి యువతకు అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ ప్రపంచం యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధికి కొత్త మార్గాలను తెరిచింది. ఆన్‌లైన్ విద్యా వేదికల ద్వారా ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థల జ్ఞానం కూడా ఇప్పుడు అందుబాటులో ఉంది. యువత తమ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసుకునే అవకాశాలు కూడా పెరిగాయి. సమాచార సాంకేతిక రంగం, సృజనాత్మక రంగాలు, డిజిటల్ వ్యాపారం వంటి అనేక రంగాల్లో యువత ముందుకు సాగుతున్నారు. అయితే డిజిటల్ వేదికల వినియోగం పెరుగుతున్న కొద్దీ కొన్ని సమస్యలు కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలపై అధిక ఆధారపడటం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు ఉపయోగించడం వల్ల శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. అలాగే తప్పుడు సమాచారం వ్యాప్తి, వ్యక్తిగత గోప్యత సమస్యలు కూడా పెరుగుతున్నాయి.

డిజిటల్ యుగంలో యువతకు సాంకేతికతను సరిగ్గా ఉపయోగించడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సాంకేతిక వనరులను విద్య, నైపుణ్యాల అభివృద్ధి కోసం ఉపయోగించాలి. అవసరానికి మించి సామాజిక మాధ్యమాల్లో గడపకుండా సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి. అలాగే నిజమైన సమాచారాన్ని గుర్తించే సామర్థ్యం కూడా పెంపొందించుకోవాలి. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కూడా యువతకు డిజిటల్ వినియోగంపై సరైన మార్గనిర్దేశం చేయాలి. సాంకేతికతను సమతుల్యంగా ఉపయోగించేందుకు ప్రోత్సహించాలి. యువత సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా డిజిటల్ వనరులను ఉపయోగించాలి. డిజిటల్ ప్రపంచం యువతకు అపారమైన అవకాశాలను అందిస్తున్నప్పటికీ, సవాళ్లను కూడా తెస్తోంది. అందువల్ల సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ ముందుకు సాగడం అవసరం. సరైన దిశలో డిజిటల్ వనరులను ఉపయోగిస్తే యువత వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా దేశ అభివృద్ధికి కూడా తోడ్పడగలరని నిపుణులు సూచిస్తున్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం క్లారిటీ




న్యూఢిల్లీ, మార్చి 7, మనగళం : మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా అనే సందేహం ప్రజల్లో నెలకొంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన ధరలను పెంచే ఆలోచన లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. దేశంలో చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. భారత్ తన ముడి చమురు దిగుమతుల్లో పెద్ద భాగాన్ని ఈ మార్గం ద్వారానే తెచ్చుకుంటుంది. దీంతో అక్కడ పరిస్థితులు విషమిస్తే ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ పరిస్థితిని ముందుగానే గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ దేశాల నుంచి చమురు దిగుమతులను పెంచినట్లు తెలిపింది. గతంలో హోర్ముజ్ జలసంధి మార్గంపై ఎక్కువగా ఆధారపడిన భారత్ ఇప్పుడు ఇతర సురక్షిత మార్గాల నుంచి కూడా చమురు దిగుమతులను పెంచుతోంది. ఈ వ్యూహాత్మక నిర్ణయం వల్ల దేశంలో ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల సరిపడా నిల్వలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు అవసరం ఉండదని స్పష్టం చేశారు. ఇక వంటగ్యాస్ మరియు ఎల్ఎన్‌జీ సరఫరాపై కూడా ప్రభుత్వం నిశితంగా నిఘా పెట్టింది. ఖతార్‌లోని రాస్ లఫాన్ ఉత్పత్తి కేంద్రం తాత్కాలికంగా మూసివేయబడినప్పటికీ సరఫరా మార్గాలు తిరిగి ప్రారంభమైన వెంటనే గ్యాస్ పంపిణీ కొనసాగుతుందని ఖతార్ భారత్‌కు హామీ ఇచ్చినట్లు సమాచారం. దేశంలో ప్రస్తుతం తగినంత ఎల్ఎన్‌జీ నిల్వలు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా హోర్ముజ్ జలసంధి ద్వారా ఓడల రాకపోకలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇరాన్ అధ్యక్షుడు మహమూద్ పెజెష్కియన్ పొరుగు దేశాలపై దాడులు చేయబోమని ప్రకటించిన తర్వాత పరిస్థితులు కొంత స్థిరపడినట్లు తెలుస్తోంది. దీంతో ఇంధన సరఫరా వ్యవస్థ సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# ఏటీఎంలో డెబిట్ కార్డు ఇరుక్కుపోతే ఇలా చేయాలి



న్యూఢిల్లీ, మార్చి 7, , మనగళం : డబ్బు తీసుకునేందుకు ఏటీఎం వద్దకు వెళ్లినప్పుడు కొన్నిసార్లు డెబిట్ కార్డు యంత్రంలోనే ఇరుక్కుపోయే పరిస్థితి ఎదురవుతుంది. అటువంటి సమయంలో చాలా మంది భయాందోళనలకు గురవుతారు. అయితే ఇది సాధారణంగా సాంకేతిక సమస్యల వల్ల జరిగే విషయం అని నిపుణులు చెబుతున్నారు. సరైన చర్యలు తీసుకుంటే ఖాతా భద్రతను కాపాడుకోవడంతో పాటు కార్డును తిరిగి పొందడం కూడా సాధ్యమే. ఏటీఎం మెషీన్‌లో కార్డు ఇరుక్కుపోవడానికి నెట్‌వర్క్ లోపాలు, విద్యుత్ అంతరాయం, తప్పు పిన్‌ను పదేపదే నమోదు చేయడం లేదా లావాదేవీ సమయంలో ఎక్కువ సమయం తీసుకోవడం వంటి కారణాలు ఉండవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో భద్రతా చర్యగా ఏటీఎం యంత్రం కార్డును తన వద్దే ఉంచుకుంటుంది. అలాంటి సమయంలో ముందుగా చేయాల్సింది మీ బ్యాంక్ కస్టమర్ కేర్‌కు వెంటనే సమాచారం ఇవ్వడం. ఏటీఎం మెషీన్ నంబర్, ఉన్న ప్రదేశం, సంఘటన జరిగిన సమయం వంటి వివరాలను బ్యాంకుకు తెలియజేయాలి. అవసరమైతే మీ కార్డును వెంటనే బ్లాక్ లేదా హాట్‌లిస్ట్ చేయాలని కూడా కోరవచ్చు. ఇలా చేస్తే ఎవరూ ఆ కార్డును ఉపయోగించి లావాదేవీలు చేయలేరు. కస్టమర్ సర్వీస్‌ను సంప్రదించిన తర్వాత సాధారణంగా రెండు మార్గాలను సూచిస్తారు. మొదటిది కార్డును పూర్తిగా రద్దు చేసి కొత్త కార్డు కోసం దరఖాస్తు చేయడం. సాధారణంగా కొత్త కార్డు 7 నుంచి 10 రోజులలో మీ చిరునామాకు పంపిస్తారు. రెండవది కార్డును తిరిగి పొందడం. మీ బ్యాంక్‌కు చెందిన ఏటీఎం వద్ద కార్డు ఇరుక్కుపోతే దాన్ని తిరిగి పొందడం కొంచెం సులభంగా ఉంటుంది. అయితే వేరే బ్యాంక్ ఏటీఎం వద్ద కార్డు ఇరుక్కుపోయి ఉంటే కొంత సమయం పట్టవచ్చు. యంత్రాన్ని నిర్వహించే సిబ్బంది కార్డును తీసి సంబంధిత బ్యాంకుకు పంపిస్తారు. అనంతరం బ్యాంక్ నుంచి కస్టమర్‌కు సమాచారం అందుతుంది. సాధారణంగా కార్డును తిరిగి పొందేందుకు కస్టమర్ తమ బ్యాంక్ శాఖకు వెళ్లి గుర్తింపు పత్రాన్ని చూపించాల్సి ఉంటుంది.

# సామాన్యులపై యుద్ధాల భారం

**- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలు - ప్రజల ప్రాణాలు, నివాసాలు ప్రమాదంలో - శాంతి కోసం అంతర్జాతీయ పిలుపు**



మన గళం డెస్క్ : ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు మరియు ఘర్షణలు సామాన్య ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. రాజకీయాలు, సరిహద్దు వివాదాలు, శక్తి పోటీలు వంటి కారణాలతో దేశాల మధ్య జరిగే యుద్ధాల ప్రభావం చివరికి సాధారణ ప్రజలపైనే పడుతోంది. ప్రస్తుతం ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో యుద్ధాలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ నివేదికల ప్రకారం 2024లో మాత్రమే ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఘర్షణల్లో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది. ప్రపంచంలో శాంతి పరిస్థితి గత దశాబ్దంతో పోలిస్తే క్షీణించిందని అంతర్జాతీయ పరిశోధనలు పేర్కొంటున్నాయి. యుద్ధాల వల్ల మొదటగా ప్రభావితమయ్యేది సామాన్య ప్రజల జీవన విధానం. యుద్ధాలు ప్రారంభమైన వెంటనే నగరాలు, గ్రామాలు యుద్ధభూములుగా మారిపోతాయి. ఇళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, నీటి సరఫరా వ్యవస్థలు వంటి మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతాయి. దీంతో ప్రజల జీవనాధారం పూర్తిగా కూలిపోతుంది. అంతర్జాతీయ మానవతా సంస్థల నివేదికల ప్రకారం యుద్ధాలు కుటుంబాలను విడదీసి కోట్లాది మందిని నిరాశ్రయులుగా మార్చుతున్నాయి.



ప్రస్తుతం ప్రపంచంలో యుద్ధాలు మరియు హింస కారణంగా నిరాశ్రయుల సంఖ్య భారీగా పెరిగింది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం 2025 మధ్య నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 117 మిలియన్ల మంది యుద్ధాలు, హింస లేదా ఘర్షణల కారణంగా తమ ఇళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చింది. ఇది మానవ చరిత్రలోనే అత్యధిక సంఖ్యగా పేర్కొంటున్నారు. యుద్ధాల వల్ల ప్రాణనష్టం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితి వివరాల ప్రకారం 2024లో మాత్రమే కనీసం 48 వేల మందికి పైగా ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చాలా మంది సాధారణ పౌరులేనని నివేదికలు చెబుతున్నాయి. మహిళలు, పిల్లలు, వృద్ధులు వంటి బలహీన వర్గాలే ఎక్కువగా ఈ యుద్ధాల బారిన పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు.

ఇటీవలి ఘర్షణలు కూడా ఇదే పరిస్థితిని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఉదాహరణకు మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా లక్షలాది మంది తమ నివాసాలను వదిలి వెళ్లాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో భారీ బాంబు దాడుల వల్ల నగరాలు శిథిలాలుగా మారి ప్రజలు ఆశ్రయం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది ఇదే సమయంలో ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో కూడా యుద్ధాలు ప్రజల జీవితాలను దెబ్బతీస్తున్నాయి. ఇటీవల సరిహద్దు ఘర్షణల కారణంగా వేలాది మంది తమ ఇళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చిందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. యుద్ధాలు మొదలైన వెంటనే ప్రజలు భయంతో తమ గ్రామాలు, పట్టణాలను వదిలి శరణార్థ శిబిరాలకు తరలిపోతున్నారు.

యుద్ధాలు ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, విద్య వంటి రంగాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధ ప్రాంతాల్లో ఆసుపత్రులు ధ్వంసం కావడం వల్ల వైద్య సేవలు అందుబాటులో ఉండవు. పిల్లల విద్య మధ్యలోనే ఆగిపోతుంది. ఉద్యోగాలు లేక ప్రజలు పేదరికంలోకి జారిపోతారు. యుద్ధాలు సమాజ ఆర్థిక నిర్మాణాన్ని పూర్తిగా దెబ్బతీస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాంతి చర్చలు, రాజనీతిక ప్రయత్నాలు మరింత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. దేశాల మధ్య వివాదాలను యుద్ధాల ద్వారా కాకుండా చర్చల ద్వారా పరిష్కరించడం అవసరం. ఎందుకంటే యుద్ధాల అసలు బాధితులు సాధారణ ప్రజలేనని, వారి జీవనాలు శాశ్వతంగా మారిపోతాయని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి.





# చిన్న దోమ.. పెద్ద ప్రమాదం

**- ప్రాణాంతక వ్యాధులకు కారణం - ప్రతి ఏడాది వేలాది ప్రాణాలు బలి - నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం**

మన గళం, ఆరోగ్యం : మనం సాధారణంగా పాము, పులి, సింహం వంటి జంతువులను చూసిన వెంటనే భయపడతాం. అవి ప్రమాదకరమైనవని భావించి దూరంగా ఉంటాం. అయితే వీటన్నింటికంటే కూడా మనుషుల ప్రాణాలకు ఎక్కువ ప్రమాదం కలిగించే జీవి దోమ అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చూడటానికి చిన్నగా ఉండే ఈ జీవి ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాణాలను బలి తీసుకుంటుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. దోమ పరిమాణంలో చిన్నదే అయినప్పటికీ అది కుడితే తీవ్రమైన దురదతో పాటు పలు రకాల వ్యాధులను వ్యాప్తి చేసే ప్రమాదం ఉంది. సాధారణంగా మనం దోమ కుడితే పెద్దగా పట్టించుకోము. కానీ అదే దోమ ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధులు తీవ్రస్థాయికి చేరితే ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు కూడా ఏర్పడతాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో లేదా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.

దోమల నుండి రక్షణ పొందాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా అవసరం. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమల వలలు ఉపయోగించడం, దోమలను దూరంగా ఉంచే మందులు ఉపయోగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలా ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా దోమల ద్వారా వ్యాపించే ప్రమాదకర వ్యాధులను నివారించవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# వంటింటి ఆహారంతోనే బరువు తగ్గడం సాధ్యం

**- చక్కెర తగ్గిస్తే ఆరోగ్య ప్రయోజనం - సాధారణ ఆహారంతో ఆకలి నియంత్రణ - జీవనశైలి మార్పులతో మెరుగైన ఫలితాలు**

మన గళం, ఆరోగ్యం : బరువు తగ్గడం అనేది ఖరీదైన ప్రక్రియ అని చాలా మంది భావిస్తుంటారు. జిమ్‌లు, ఖరీదైన ఆహార ప్రణాళికలు అవసరమని అనుకుంటారు. అయితే వంటింట్లో లభించే సాధారణ ఆహార పదార్థాలతోనే ఎలాంటి ఖర్చు లేకుండా బరువు తగ్గవచ్చని తమిళనాడు ప్రజారోగ్య అధికారి ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు. కార్బోహైడ్రేట్లను తగ్గిస్తూ జీవనశైలిలో చిన్న మార్పులు చేసుకుంటే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన సూచిస్తున్నారు. చాలా మందికి రోజును టీ లేదా కాఫీతో ప్రారంభించే అలవాటు ఉంటుంది. అయితే బరువు తగ్గాలనుకునే వారు చక్కెరను పూర్తిగా తగ్గించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. చక్కెర లేకుండా నిమ్మకాయ టీ, బ్లాక్ కాఫీ లేదా బ్లాక్ టీ తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే



కొద్దిపాటి పాలతో కూడా చక్కెర లేకుండా తాగవచ్చు. ఇలా చేయడం వల్ల శరీరంలో అవసరం లేని కేలరీలు తగ్గుతాయి. మనం సాధారణంగా తీసుకునే ఇడ్లీ, దోసెలలో స్టార్చ్ ఎక్కువగా ఉంటుంది. దీనికి బదులుగా ఉడికించిన లేదా కాల్చిన వేరుశనగలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. వేరుశనగల్లో ఉండే ప్రోటీన్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. దీంతో తరచూ ఆకలి వేయకుండా ఉండి అదనపు ఆహారం తీసుకునే అలవాటు తగ్గుతుంది.

డైటింగ్ సమయంలో మధ్యలో ఆకలి వేయడం సహజమే. అలాంటి సమయంలో చిరుతిండి తీసుకునే బదులుగా దోసకాయను తినడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండడంతో పాటు కేలరీలు తక్కువగా ఉంటాయి. రోజూ తినే అన్నాన్ని కూడా కొంత తగ్గించి కూరగాయలు, గుడ్లు వంటి పోషక ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరానికి అవసరమైన పీచు, ప్రోటీన్ అందుతాయి. ఇలా ఆహారంలో చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా బరువు తగ్గవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



# మద్యం లేకపోయినా కాలేయ వ్యాధులు పెరుగుదల

**- ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు - జీవనశైలి మార్పులతో ప్రమాదం తగ్గుతుంది - నిరంతర పరీక్షలతో ముందస్తు గుర్తింపు**

మన గళం, ఆరోగ్యం : ఇటీవలి కాలంలో మద్యం సేవించని వారిలో కూడా కాలేయ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలేయ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి అరికట్టడం చాలా అవసరం. అయితే ప్రారంభ దశలో లక్షణాలు స్వల్పంగా మాత్రమే కనిపించడంతో చాలా మంది దీనిని తేలికగా తీసుకుంటారు. కానీ ఇలా నిర్లక్ష్యం చేయడం వల్ల సమస్య మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. మద్యం సేవించని వారిలో కూడా కాలేయం దెబ్బతినడానికి పలు కారణాలు ఉంటాయి. అధిక కొవ్వు కలిగిన ఆహారం తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, శరీర బరువు పెరగడం వంటి జీవనశైలి కారణాలు ప్రధానంగా ఉంటాయి. అలాగే మధుమేహం, అధిక



కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు వంటి సమస్యలు కూడా కాలేయ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. వీటి కారణంగా కొవ్వు కాలేయంలో పేరుకుపోయి కాలేయ పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కాలేయ సమస్యలు ప్రారంభంలో పెద్దగా కనిపించకపోయినా కొన్ని లక్షణాలు కనిపించవచ్చు. శరీరంలో బలహీనత, ఆకలి లేకపోవడం, కడుపు కుడి వైపున భారంగా అనిపించడం వంటి సమస్యలు మొదట కనిపిస్తాయి. కొంతమందిలో గ్యాస్, అజీర్తి, బరువు పెరగడం వంటి సమస్యలు కూడా కనిపించవచ్చు. వ్యాధి తీవ్రమైతే చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం, మూత్రం ముదురు పసుపు రంగులో కనిపించడం, కాళ్లలో వాపు రావడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.

కాలేయ సమస్యలు రాకుండా ఉండాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం చాలా ముఖ్యం. కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాలను తగ్గించి, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయడం, శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవడం అవసరం. అలాగే తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కాలేయ సమస్యలను ముందుగానే గుర్తించి సరైన చికిత్స తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.



# వేసవిలో సబ్జా గింజల నీరు ఆరోగ్యానికి మేలు


- సహజంగా చల్లదనం ఇచ్చే గుణం
- పోషకాలతో నిండిన చిన్న గింజలు
- జీర్ణక్రియకు సహాయపడే పీచు పదార్థం

మన గళం, ఆరోగ్యం : వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచే సహజ ఆహారాలను తీసుకోవడం చాలా అవసరం. అలాంటి ఆహారాల్లో సబ్జా గింజలు ముఖ్యమైనవి. వీటిని తులసి గింజలు లేదా ఫలూదా గింజలు అని కూడా పిలుస్తారు. చిన్న పరిమాణంలో కనిపించినప్పటికీ ఈ గింజలు అనేక పోషక గుణాలతో నిండి ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో సబ్జా గింజలతో చేసిన నీరు తీసుకోవడం శరీరానికి చల్లదనం అందించి ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడుతుంది. సబ్జా గింజలను పోషకాల సమృద్ధిగా కలిగిన ఆహారంగా భావిస్తారు. వీటిలో పీచు పదార్థం అధికంగా ఉండడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలాగే ప్రోటీన్, మెగ్నీషియం, కాల్షియం వంటి ఖనిజాలు కూడా ఇందులో సమృద్ధిగా ఉంటాయి. శరీరానికి అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు కూడా వీటిలో లభిస్తాయి. సబ్జా గింజల్లో కేలరీలు తక్కువగా ఉండడం వల్ల బరువు నియంత్రణలో కూడా ఇవి సహాయపడతాయి. అదనంగా ఒమేగా మూడు కొవ్వు ఆమ్లాలు మరియు ఇతర ఖనిజాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని ఇచ్చేలా చేయడంతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

వేసవిలో సబ్జా గింజలను నీటిలో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీర వేడి తగ్గుతుంది. అలాగే దాహాన్ని తగ్గించి శరీరానికి తగినంత తేమను అందిస్తుంది. రోజువారీ ఆహారంలో సబ్జా గింజలను చేర్చుకోవడం ద్వారా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఇయర్‌ఫోన్స్ అధిక వినియోగం ప్రమాదం





మన గళం, ఆరోగ్యం : ప్రస్తుత కాలంలో ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్‌బడ్స్ ఉపయోగించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వయస్సుతో సంబంధం లేకుండా చాలా మంది ప్రయాణ సమయంలో, ఇంట్లో విశ్రాంతిగా ఉన్నప్పుడు లేదా పని చేసుకుంటూనే ఇయర్‌ఫోన్స్ ఉపయోగిస్తున్నారు. చుట్టూ ఉన్న శబ్దాన్ని తగ్గించి పని మీద దృష్టి పెట్టేందుకు ఇవి సహాయపడుతున్నప్పటికీ, ఎక్కువ సమయం లేదా అధిక శబ్దంతో వినడం ఆరోగ్యానికి హానికరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వినికిడి వ్యవస్థపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. వైద్యుల ప్రకారం 85 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దంతో దీర్ఘకాలం ఆడియో వినడం వల్ల వినికిడి శక్తి తగ్గే ప్రమాదం ఉంటుంది. ఇది చెవిలోని నాడులను శాశ్వతంగా దెబ్బతీయవచ్చు. ముఖ్యంగా యువతలో ఈ సమస్య ఎక్కువగా కనిపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇయర్‌ఫోన్స్‌ను ఎక్కువ సమయం వాడటం వల్ల చెవిలో మోగుతున్నట్టు అనిపించడం, లాగుతున్నట్టు భావన కలగడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అలాగే ఎక్కువ సమయం ఆడియో వినడం వల్ల చెవులు, మెదడు అలసిపోవడం వల్ల మాటలను స్పష్టంగా గుర్తించడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతాయి. ఇయర్‌ఫోన్స్‌ను ఎక్కువ సమయం వినడం వల్ల బయట జరిగే శబ్దాలు వినిపించకపోవడంతో చుట్టూ ఉన్న పరిస్థితులను గమనించే సామర్థ్యం తగ్గుతుంది. ముఖ్యంగా ప్రయాణ సమయంలో ఇయర్‌ఫోన్స్ వాడటం ప్రమాదకర పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉంది. రహదారిపై వాహనాల శబ్దాలు వినిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదం పెరుగుతుంది. కొన్ని పరిశోధనల ప్రకారం రోజుకు రెండు గంటలకు పైగా ఇయర్‌ఫోన్స్ వినే వారిలో జ్ఞాపకశక్తి తగ్గే సమస్యలు కూడా కనిపించే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

అయితే ఇయర్‌ఫోన్స్‌ను సరైన విధంగా ఉపయోగిస్తే ఈ ప్రమాదాలను తగ్గించవచ్చు. చెవిలో నేరుగా శబ్దాన్ని పంపే ఇయర్‌బడ్స్ కంటే బయట నుంచి ధరించే హెడ్‌ఫోన్స్ ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే శబ్దాన్ని తక్కువ స్థాయిలో ఉంచి వినడం, కొంతసేపు వినిన తర్వాత విరామం తీసుకోవడం అవసరం. ట్రాఫిక్ లేదా ఎక్కువ శబ్దం ఉన్న ప్రదేశాల్లో వాల్యూమ్ పెంచి వినకుండా ఉండాలి.

## 10 రోజుల ముందే టికెట్ల వేట..




మన గళం, రణ్‌వీర్ సింగ్ అభిమానులకు మరియు సినీ ప్రియులకు గుడ్ న్యూస్ అందింది. రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' మార్చి 19న విడుదల కాబోతుండగా.. విడుదల తేదీ కంటే పది రోజుల ముందే ఇండియాలో అడ్వాన్స్ బుకింగ్స్‌ను ప్రారంభించారు మేకర్స్. ఇప్పటికే అమెరికా, ఆస్ట్రేలియా వంటి విదేశీ మార్కెట్లలో బుకింగ్స్ ఓపెన్ అయి రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతున్నాయి. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి మార్చి 18వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచే భారీ స్థాయిలో పెయిడ్ ప్రివ్యూలను ప్లాన్ చేశారు. మొదటి భాగం హిందీలో భారీ విజయం సాధించగా, ఈ సీక్వెల్‌ను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు. సుమారు 3 గంటల 40 నిమిషాల సుదీర్ఘ రన్ టైమ్‌తో వస్తున్న ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద రూ.1400 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన నేపథ్యంలో, రెండో భాగంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ముఖ్యంగా పోటీగా రావాల్సిన యష్ 'టాక్సిక్' సినిమా జూన్ నెలకు వాయిదా పడటంతో, 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సోలోగా సరికొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## గద్దర్ అవార్డులు ప్రకటింపు

హైదరాబాద్ 7 మార్చి ,మన గళం: తెలుగు చలనచిత్ర రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డులు2025 విజేతల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం శనివారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అత్యున్నత పురస్కారాల్లో భాగంగా సినీ రంగానికి విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు అరుదైన గౌరవం లభించింది. తెలుగు సినీ పరిశ్రమకు నాలుగు దశాబ్దాలుగా తన నటనతో అపారమైన సేవలు అందించిన ప్రముఖ నటుడు చిరంజీవికి ప్రతిష్టాత్మక ఎన్టీఆర్

జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే భారతీయ చలనచిత్ర రంగంలో తన విలక్షణ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ నటుడు కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డును ప్రకటించారు.

ఈ అవార్డుల వివరాలను ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ వెల్లడిస్తూ, 2025 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తిచేసుకున్న చిత్రాలు మరియు చిన్న చిత్రాల నుంచి విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో ప్రముఖ నటి జయసుధకు ఏఎన్నార్ పురస్కారం, ప్రముఖ నిర్మాత అశ్విని దత్‌కు నాగిరెడ్డిచక్రపాణి అవార్డు, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు సినారే అవార్డు ప్రకటించబడ్డాయి. తెలుగు చలనచిత్ర రంగానికి వారు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డులను ఈ నెల 19వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఘన కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సినీ, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానుండగా అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. తెలుగు సినీ రంగంలో ప్రతిభను ప్రోత్సహించడంలో ఈ అవార్డులు కీలక పాత్ర పోషిస్తాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.





## బాలీవుడ్‌లో మరో సినిమాకు సిద్ధమవుతున్న శ్రీలీల

ముంబై, 7 మార్చి ,మన గళం,: దక్షిణ భారత చిత్రసీమలో వరుస విజయాలతో గుర్తింపు పొందిన హీరోయిన్ శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌లో మరో సినిమాకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సౌత్ ఇండస్ట్రీలో సక్సెస్ సాధించిన పలువురు హీరోయిన్లు బాలీవుడ్ వైపు అడుగులు వేస్తుండగా, అదే జాబితాలో శ్రీలీల కూడా చేరారు. ఇప్పటికే బాలీవుడ్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నాలు ప్రారంభించిన ఆమె ప్రస్తుతం కొత్త ప్రాజెక్ట్‌తో వార్తల్లో నిలుస్తున్నారు. శ్రీలీల బాలీవుడ్ ప్రయాణం కొన్ని నెలల క్రితమే ప్రారంభమైనప్పటికీ ఆమె తొలి సినిమా ఇప్పటికీ విడుదల కాలేదు. ప్రముఖ నటుడు కార్తీక్ ఆర్యన్ సరసన ఆమె నటించిన సినిమా విడుదల ఆలస్యం కావడంతో ఆమె డెబ్యూ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా విడుదల తర్వాతే ఆమెకు బాలీవుడ్‌లో మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక సౌత్ ఇండస్ట్రీలో మాత్రం శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు. తెలుగు చిత్రసీమలో పలువురు ప్రముఖ హీరోలతో కలిసి ఆమె నటించిన సినిమాలు మంచి విజయాలు సాధించాయి. తన నటన, నృత్యంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శ్రీలీలకు యువతలో మంచి అభిమాన వర్గం ఉంది. ఇటీవల మరో ఆసక్తికరమైన బాలీవుడ్ ప్రాజెక్ట్‌కు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్‌లో కూడా తన ప్రతిభను నిరూపించుకోవాలని శ్రీలీల భావిస్తున్నట్లు తెలుస్తోంది.



## వెంకటేష్‌అనిల్ రావిపూడి కాంబోలో కొత్త సినిమా



హైదరాబాద్ 7 మార్చి ,మన గళం: టాలీవుడ్‌లో విజయవంతమైన కాంబినేషన్‌లలో ఒకటిగా గుర్తింపు పొందిన నటుడు వెంకటేష్ మరియు దర్శకుడు అనిల్ రావిపూడి జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే వీరి కాంబినేషన్‌లో వచ్చిన పలు చిత్రాలు ప్రేక్షకాదరణ పొందడంతో పాటు వాణిజ్యపరంగా కూడా మంచి విజయాన్ని సాధించాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో వినోదాత్మక చిత్రాన్ని తెరకెక్కించేందుకు దర్శకుడు అనిల్ రావిపూడి సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ కొత్త ప్రాజెక్ట్‌కు వెంకటేష్ కూడా సమ్మతి తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం కథా రూపకల్పన మరియు స్క్రిప్ట్ పనుల్లో దర్శకుడు బిజీగా ఉన్నారని సినీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే వీరి కాంబినేషన్‌లో వచ్చిన కొన్ని సినిమాలు ప్రేక్షకులను బాగా అలరించాయి. వినోదానికి ప్రధాన ప్రాధాన్యత ఇచ్చే అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండటంతో ఈ జోడీకి మంచి క్రేజ్ ఏర్పడింది. అదే జోష్‌ను కొనసాగిస్తూ మరోసారి ప్రేక్షకులకు పూర్తి వినోదాన్ని అందించే కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నటుడు కళ్యాణ్ రామ్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. కథలో కీలక మలుపు తిప్పేలా ఆయన పాత్ర ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. వెంకటేష్ మరియు కళ్యాణ్ రామ్ ఒకే సినిమాలో కనిపించనున్నారనే వార్త ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇక ఈ సినిమాలో వెంకటేష్ సరసన హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. గతంలో తన ప్రతిభతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కళ్యాణ్ రామ్‌కు జోడీగా నటించే హీరోయిన్ ఎంపిక ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. చిత్ర బృందం త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించనుండగా సినిమాటోగ్రఫీ బాధ్యతలను సమీర్ రెడ్డి నిర్వహించనున్నారు. నిర్మాణ బాధ్యతలను ప్రముఖ నిర్మాణ సంస్థలు కలిసి చేపట్టనున్నాయి. ప్రస్తుతం వెంకటేష్ నటిస్తున్న సినిమా పూర్తయ్యాక తర్వాత ఈ కొత్త ప్రాజెక్ట్ చిత్రీకరణ ప్రారంభం కానుంది. జూన్ నెలలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి సంక్రాంతి సీజన్‌ను లక్ష్యంగా పెట్టుకుని సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. దర్శకుడు అనిల్ రావిపూడి ప్రత్యేకమైన హాస్యశైలి, వెంకటేష్ టైమింగ్ కామెడీ మరియు ఇతర నటీనటుల పాత్రలు కలిసి ఈ చిత్రాన్ని పెద్ద వినోదాత్మక సినిమాగా నిలబెట్టే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

## పక్కా ప్రణాళిక ఉంటే ఏదైనా సాధ్యమే: కరీనా కపూర్

ముంబయి, మార్చి 7,మన గళం: తల్లైన తర్వాత జీవితంలో ప్రాధాన్యతలు మారడం సహజమేనని ప్రముఖ నటి కరీనా కపూర్ అన్నారు. అయితే సరైన ప్రణాళికతో కుటుంబ బాధ్యతలు మరియు వృత్తి జీవితాన్ని సమతుల్యంగా కొనసాగించడం సాధ్యమేనని ఆమె అభిప్రాయపడ్డారు. బాలీవుడ్‌లో ప్రముఖ నటీమణులు దీపికా పదుకొణె, కరీనా కపూర్ తల్లైన తర్వాత తమ కెరీర్‌ను ఎలా నిర్వహించాలి అనే అంశంపై వ్యక్తపరిచిన అభిప్రాయాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీస్తున్నాయి. పని గంటలను పరిమితం చేయాలని దీపికా సూచిస్తే, ముందస్తు ప్రణాళికతో అన్నీ సాధ్యమని కరీనా చెప్పడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తల్లైన తర్వాత తన ప్రాధాన్యతలు మారాయని దీపికా ఇటీవల పేర్కొంటూ రోజుకు ఎనిమిది గంటలకే పని పరిమితం చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా తల్లయిన మహిళలకు చిత్రసీమ మరియు కుటుంబం మద్దతుగా నిలవాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం కారణంగా కొన్ని భారీ చిత్రాల అవకాశాలను వదులుకోవాల్సి వచ్చిందన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుండగా, మరికొందరు చిత్ర నిర్మాణంలో ఇది ఎల్లప్పుడూ సాధ్యం కాదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా కరీనా కపూర్ స్పందిస్తూ, సరైన ప్రణాళికతో కుటుంబ బాధ్యతలు మరియు పనిని సమన్వయం చేసుకోవచ్చని చెప్పారు. ఒక చిత్రీకరణ కోసం విదేశాల్లో సుమారు ముప్పై ఐదు రోజులు ఉండాల్సి వచ్చిన సందర్భంలో ముందుగానే ప్రణాళిక రూపొందించుకుని పిల్లల బాధ్యతను నిర్వహించగలిగానని తెలిపారు. తాను పనిలో ఉండగా తన భర్త సైఫ్ అలీ ఖాన్ ఇంట్లో పిల్లలను చూసుకున్నారని, ఇద్దరూ ఒకేసారి పని కోసం బయటకు వెళ్లకూడదనే నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. చిత్రీకరణ మధ్యలో విరామం తీసుకుని స్వదేశానికి వచ్చి పిల్లలతో సమయం గడిపేలా చిత్ర బృందం సహకరించిందని చెప్పారు. అన్నీ ముందుగానే ప్రణాళిక చేసుకుంటే కుటుంబం మరియు వృత్తి మధ్య సమతుల్యత సాధ్యమవుతుందని కరీనా అభిప్రాయపడ్డారు.



# ఫైనల్‌కు బ్యాటింగ్‌కు అనుకూల పిచ్



అహ్మదాబాద్, మార్చి 7, మన గళం: టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న తుది పోరుకు బ్యాటర్లకు అనుకూలించే పిచ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గత టోర్నీల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారత జట్టు యాజమాన్యం పిచ్ ఎంపిక విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మ్యాచ్ ఆసక్తికరంగా సాగేందుకు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే విధంగా పిచ్‌ను రూపకల్పన చేస్తున్నట్లు క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఫైనల్ మ్యాచ్ కోసం ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో కూడిన ప్రత్యేక పిచ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇందులో ఎర్రమట్టిని ఎక్కువగా ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఎర్రమట్టి ఉండటం వల్ల పిచ్‌పై బంతికి మంచి బౌన్స్ లభించే అవకాశం ఉంటుంది. దీంతో బ్యాటర్లు షాట్లు ఆడేందుకు మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు జట్లు కూడా దూకుడుగా బ్యాటింగ్ చేసే అవకాశం ఉండటంతో మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. స్పిన్నర్లకు ఈ పిచ్ పెద్దగా సహకరించకపోవచ్చని క్రీడా నిపుణులు చెబుతున్నారు. బౌన్స్ ఎక్కువగా ఉండటంతో ఫాస్ట్ బౌలర్లకు కొంతవరకు సహాయం లభించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రధానంగా బ్యాటర్లకు అనుకూల పరిస్థితులు ఉండే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో మ్యాచ్‌లో 200 పరుగుల స్కోరు కూడా సాధారణంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఈ వ్యూహాత్మక నిర్ణయం వెనుక గత అనుభవాలు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమికి నెమ్మదిగా ఉన్న నల్లమట్టి పిచ్ ఒక కారణంగా నిలిచినట్లు విశ్లేషణలు వచ్చాయి. అంతేకాకుండా ప్రస్తుత టోర్నీలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో కూడా పిచ్ స్వభావం టీమిండియాపై ప్రభావం చూపింది. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందుగానే వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత జట్టు యాజమాన్యం స్థానిక క్యూరేటర్లతో చర్చించి ఫైనల్ మ్యాచ్‌కు అనుకూలంగా ఉండే విధంగా పిచ్‌ను సిద్ధం చేయాలని సూచించినట్లు సమాచారం. లీగ్ దశలో కొన్ని పిచ్‌ల తీరుపై జట్టు యాజమాన్యం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు కూడా క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకే ఈసారి ఎలాంటి సందేహాలు లేకుండా ముందుగానే పిచ్ రూపకల్పనపై స్పష్టత తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. క్రీడా వర్గాల అభిప్రాయం ప్రకారం ఈ పిచ్ దూకుడైన బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ టోర్నీలో ఇదే మైదానంలో జరిగిన ఒక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 213 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఫైనల్ మ్యాచ్‌లో కూడా పరుగుల వరద పారే అవకాశం ఉందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అభిషేక్‌కే మరో అవకాశం




అహ్మదాబాద్, మార్చి 7, మన గళం: టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు ముందు భారత జట్టులో ఒక కీలక అంశం చర్చకు దారితీస్తోంది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా తక్కువ స్కోర్లతో నిరాశపరిచినప్పటికీ, తుదిపోరులో కూడా అతడికే అవకాశం ఇవ్వాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. ఆదివారం అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చకూడదనే ఆలోచనతో టీమ్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయానికి మొగ్గు చూపుతున్నట్లు క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఈ టోర్నీ ప్రారంభంలో అభిషేక్ శర్మ జట్టుకు కీలక ఆటగాడిగా నిలుస్తాడని అంచనాలు ఉన్నాయి. అయితే టోర్నీ కీలక దశకు చేరుకునే సరికి అతడి ఫామ్ పడిపోయింది. గత ఆరు మ్యాచుల్లో అతడు 0, 0, 0, 15, 10, 9 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. జింబాబ్వేపై చేసిన అర్ధశతకం మినహా ఈ టోర్నీలో అతడి నుంచి పెద్ద ఇన్నింగ్స్ రాలేదు. దీంతో ఓపెనింగ్ విభాగంపై కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. అభిషేక్ ఫామ్ తగ్గడానికి ఆరోగ్య సమస్యలు కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. లీగ్ దశ తర్వాత అతడు కడుపు ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు సమాచారం. ఆ సమయంలో బరువు కూడా తగ్గిపోవడంతో అతడి ఆటపై ప్రభావం పడినట్లు క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో ప్రత్యర్థి జట్లు అతడి బలహీనతలను గుర్తించి ప్రత్యేక వ్యూహాలతో బౌలింగ్ చేస్తున్నాయి. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌తో అతడిని కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. పవర్‌ప్లేలో వేగం ఉన్న బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో అభిషేక్ శర్మ దూకుడుగా ఆడగలడని తెలిసినా, స్పిన్నర్ల బంతులను ఎదుర్కోవడంలో అతడు ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తోంది. ఆఫ్ స్పిన్నర్లు మరియు స్లో లెఫ్ట్ ఆర్మ్ బౌలర్లతో అతడిని పరుగులు చేయకుండా నిరోధిస్తున్నాయి. పేస్ లేని బంతులను ఎదుర్కొనే సమయంలో షాట్లు ఆడేందుకు తొందరపడటం వల్ల వికెట్లు కోల్పోతున్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి.

అతడి స్థానంలో రింకూ సింగ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, అలా చేస్తే జట్టు సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. రింకూను తీసుకుంటే అతడు దిగువ క్రమంలో బ్యాటింగ్ చేయాల్సి వస్తుంది. అందువల్ల ఓపెనింగ్ కాంబినేషన్‌ను మార్చకుండా అభిషేక్ శర్మపైనే నమ్మకం ఉంచాలని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# ఆస్ట్రేలియా ఆలౌట్



అహ్మదాబాద్, మార్చి 7, మన గళం: భారత మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 323 పరుగులకు ఆలౌటైంది. దీంతో టీమిండియాపై 125 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అన్నాబెల్ సదర్లాండ్ 129 పరుగులతో శతకం సాధించి జట్టును ఆదుకుంది. ఎలీస్ పెర్రీ 76 పరుగులతో హాఫ్ సెంచరీ నమోదు చేసింది. భారత బౌలర్ సయాలీ సత్ఘరే అరంగేట్రంలోనే అద్భుత ప్రదర్శన కనబరిచింది. నాలుగు వికెట్లు తీసి ఆస్ట్రేలియా జట్టును కాస్త కట్టడి చేసింది. క్రాంతి గౌడ్, దీప్తి శర్మ తలో రెండు వికెట్లు పడగొట్టగా, స్నేహ్ రాణా, షెఫాలీ వర్మ తలో వికెట్ సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 198 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా బ్యాటర్లలో సదర్లాండ్, పెర్రీ మినహా మిగతా ఆటగాళ్లు పెద్దగా రాణించలేకపోయారు. జార్జియా వాల్ 2, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 9, అలీసా హీలీ 13, బెత్ మూనీ 19, ఆష్లీ గార్డ్‌నర్ 1, మెక్ గ్రాత్ 13, అలానా కింగ్ 21, లూసీ హమిల్టన్ 23 పరుగులు చేసి ఔటయ్యారు.

# ఈనెల 25 నుంచి ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్



రాయ్‌పూర్, మార్చి 7,మన గళం: గిరిజన క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో కేంద్ర క్రీడాశాఖ ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్ నిర్వహణకు సిద్ధమైంది. ఈ మెగా క్రీడా వేడుక ఈ నెల 25న ప్రారంభమై ఏప్రిల్ 6 వరకు కొనసాగనుంది. కేంద్ర క్రీడా శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, భారత ఒలింపిక్ సంఘం మరియు వివిధ జాతీయ క్రీడా సమాఖ్యలు సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించనున్నాయి. దేశంలోని గిరిజన ప్రాంతాల నుంచి యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ ఏడాది ఈ క్రీడలకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఆతిథ్యం ఇస్తోంది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రసిద్ధి చెందిన ఈ రాష్ట్రంలో రాయ్‌పూర్, జగ్‌దల్‌పూర్, సర్గుజా ప్రాంతాల్లోని వివిధ క్రీడా మైదానాల్లో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ పర్యవేక్షణలో ఈ క్రీడలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ పోటీల్లో మొత్తం ఏడు మెడల్ క్రీడలను నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ, స్విమ్మింగ్, రెజ్లింగ్ వంటి క్రీడలతో పాటు సంప్రదాయ క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. మల్లఖంభ్ వంటి భారతీయ సంప్రదాయ క్రీడను కూడా ఈ పోటీల్లో చేర్చారు. అదేవిధంగా కబడ్డీ పోటీలు కూడా నిర్వహించనున్నారు. ఈ క్రీడలు గిరిజన యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సహాయపడతాయని నిర్వాహకులు భావిస్తున్నారు.

# న్యూజిలాండ్‌నే అసలైన చోకర్స్: స్టెయిన్




ముంబై, మార్చి 7, మన గళం: ప్రపంచకప్ వంటి టోర్నీల్లో నాకౌట్ దశలోనే ఇంటిదారి పట్టే దక్షిణాఫ్రికా జట్టును 'చోకర్స్' అని పిలవడం సాధారణంగా మారింది. అయితే మాజీ పేసర్ డేల్ స్టెయిన్ మాత్రం తమ జట్టును చోకర్స్‌గా పిలవడాన్ని ఖండించాడు. అసలైన చోకర్స్ న్యూజిలాండ్ జట్టేనని సంచలన వ్యాఖ్యలు చేశాడు. పొట్టి ప్రపంచకప్ సెమీఫైనల్లో అనూహ్యంగా తడబడి దక్షిణాఫ్రికా మరోసారి విమర్శలు ఎదుర్కొంది. ఐసీసీ టోర్నీల్లో లీగ్ దశలో అద్భుతంగా ఆడినా, నాకౌట్ మ్యాచ్‌ల్లో మాత్రం ఆశించిన ఫలితాలు సాధించలేకపోవడం ఆ జట్టుకు అలవాటుగా మారిందని అభిమానులు అంటున్నారు. రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ ఫైనల్లో గెలిచే మ్యాచ్‌ను కూడా ప్రొటీస్ జట్టు చేజార్చుకుంది. ఈసారి కూడా లీగ్ దశ నుంచి సూపర్ 8 వరకూ అజేయంగా నిలిచినా, సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి చవిచూసింది. ఈ నేపథ్యంలో స్టెయిన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ దక్షిణాఫ్రికాను చోకర్స్ అంటున్నారని, కానీ న్యూజిలాండ్ కూడా ఎక్కువ వరల్డ్‌కప్ ట్రోఫీలు గెలవలేదని పేర్కొన్నారు. కివీస్ జట్టు తమ జట్టుకంటే ఎక్కువసార్లు ఫైనల్స్ ఆడినా, ట్రోఫీలు మాత్రం చాలా తక్కువగా గెలిచిందని తెలిపారు. ఇప్పటివరకు న్యూజిలాండ్ జట్టు ఎనిమిదిసార్లు ఐసీసీ ఫైనల్స్ ఆడింది. అయితే కేవలం రెండుసార్లు మాత్రమే విజేతగా నిలిచింది. 2000లో ఐసీసీ నాకౌట్ ట్రోఫీ గెలిచిన కివీస్, 2021లో కేన్ విలియమ్సన్ సారథ్యంలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత మాత్రం కీలక ఫైనల్స్‌లో ఓటములను ఎదుర్కొంటూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగే ఫైనల్లో భారత్ చేతిలో న్యూజిలాండ్ ఓడితే, అసలైన చోకర్స్ అనే ట్యాగ్ వారికి సరిపోతుందని స్టెయిన్ వ్యాఖ్యానించాడు.

# టీమిండియాలోని ప్రతి ప్లేయర్‌తో ప్రమాదమే




అహ్మదాబాద్, మార్చి 7,మన గళం: టీమిండియాతో పోటీ పడటం సులభం కాదని న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ వ్యాఖ్యానించారు. భారత జట్టులో కేవలం జస్ప్రీత్ బుమ్రా మాత్రమే కాదు, ప్రతి ప్లేయర్ మ్యాచ్‌ను మలుపు తిప్పగల సామర్థ్యం కలిగి ఉన్నాడని ఆయన అన్నారు. అందువల్ల ఇండియా జట్టును ఎదుర్కొనే సమయంలో చాలా జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుందని తెలిపారు. మీడియాతో మాట్లాడిన శాంట్నర్, బుమ్రా గురించి ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఆయన వరల్డ్ క్లాస్ బౌలర్ మాత్రమే కాకుండా మ్యాచ్ ఫలితాన్ని మార్చగల గేమ్ చేంజర్ అని పేర్కొన్నారు. కీలక సమయాల్లో వికెట్లు తీసే సామర్థ్యం బుమ్రాకు ఉందని అన్నారు. అహ్మదాబాద్‌లో జరగనున్న మ్యాచ్‌కు సంబంధించిన పిచ్‌ను ఇంకా చూడలేదని శాంట్నర్ తెలిపారు. అయితే ఆ పిచ్‌పై మ్యాచ్ హై స్కోరింగ్‌గా ఉండే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇండియా టీమ్‌లో ప్రతి ప్లేయర్ కీలక సమయంలో మ్యాచ్‌ను టర్న్ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాడని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.